


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



*(గత సంచిక తరువాయి)*

**నాకంటే భూషణ్ నంబరు** బాగా ముందుంది. అప్పుడిద్దరం కలిసి ఒకందుకు బెంగపెట్టుకున్నాం. ఇంతమంది అభ్యర్థుల్ని సాయంత్రం నాలుగు గంటలలోగా ఇంటర్వ్యూ చేయడం సాధ్యమా? మాకారోజు ట్రయిన్ దొరికి - భయంకరమైన హోటల్ గదినుంచి విముక్తి లభిస్తుందా?

"ఆలోచించి, భయపడి ప్రయోజనం లేదు. ఏం జరగాలని రాసిపెట్టి ఉంటే అది జరుగుతుంది -" అన్నాను.

ఈలోగా ఇంటర్వ్యూకు వచ్చిన వాళ్లను రెండు జట్లుగా విడదీశారు. మధ్యాహ్నం జట్టు వాళ్ళు ముందుగానే డాడ్ (DAAD) ఆఫీసుకు వెళ్ళి కొన్ని ఫారాలు నింపాలిట. భువనేశ్వర్ వాళ్లం నలుగురమూ మధ్యాహ్నం జట్లో పడ్డాం. వాకబు చేస్తే వెడితే నడిచిపోయేటంత దగ్గర్లోనే ఉందట ఆ ఆఫీసు. అయినా ఆలస్యమవుతుందని టాక్సీలో వెళ్ళాం మేం నలుగురం.

డాడ్ ఆఫీసులో ప్రత్యేకాకర్షణ - అందరితోనూ తియ్యగా మాట్లాడే నిలువెత్తు పంజాబీ అమ్మాయి. గోధుమవర్ణం, చూడచక్కని ముఖం, ఆధునిక దుస్తులు - అన్నీ ఆమెకు అందాన్ని సంతరించాయి. ఆమెతో పదేపదే మాట్లాడడం కోసం మాలో చాలామందికి సందేహాలు వచ్చాయి. చెరగని చిరునవ్వుతో, తొణకని కంఠస్వరంతో, కోల్పోని ఓర్పుతో అందరికీ ఆమె సహకరించింది. ఫారాలు తొందరగానే పూర్తిచేసి దారిలో ఒకచోట పళ్లు తిని, నడుచుకుంటూనే సీయస్సయ్యార్ ఆఫీసుకి తిరిగి చేరుకున్నాం. అక్కడ కేంటీన్లో ఎవరిక్కావలసిన టిఫిను వాళ్లం తిన్నాం.

ఇంటర్వ్యూ తొమ్మిదికి ప్రారంభం కావాలి. పదకొండుకు ప్రారంభమైంది. అయినా ఒంటిగంటకల్లా మొదటి జట్టు పూర్తయిపోయింది. అప్పుడింటర్వ్యూ బోర్డు మెంబర్స్ లంచ్‌కి వెళ్లారు.

నేనూ, భూషణ్ బెంగపడుతున్నాం. మా ట్రయిన్ ఆరుగంటలకు. మేమిద్దరం హోటలు గదికి వెళ్ళి సామాను సర్దుకుని రైల్వే స్టేషనుకు వెళ్లాలి. ఇంటర్వ్యూ మళ్లీ ఎన్నింటికి ప్రారంభమవుతుందో.

మూడింటికి ఇంటర్వ్యూ మళ్లీ మొదలయింది. అభ్యర్థులు వెడుతున్నారు, వస్తున్నారు. ఒకొక్కక్కరు అయిదు నిముషాలు కూడా పూర్తిగా ఉండడంలేదు. నా మిత్రులు కూడా ఒక్కొక్కరే లోపలకు వెళ్లి వచ్చేశారు. వాళ్లందరి ముఖాల్లోనూ ఏదో అసంతృప్తి.

"ఇంత డబ్బు ఖర్చుపెట్టి ఇంతదూరం మననెందుకు రప్పించారో తెలియదు. రెండు నిముషాల్లో మన గురించి వాళ్ళు కొత్తగా ఏం తెలుసుకుంటారు?" అన్నాడు సుధామ్.

"ఇంటర్వ్యూకి వెళ్ళిన వాళ్లకు తమ శక్తి సామర్థ్యాలు ప్రదర్శించుకోవాలనుంటుంది. ఆ విషయం ఇంటర్వ్యూ చేసే వాళ్లక్కూడా తెలిస్తే బాగుండును -" అన్నాడు ఇంద్రసేన్.

టైము నాలుగు కాకుండానే నాకు పిలుపు వచ్చింది. ప్రపంచంలో ఆర్థికంగా అత్యున్నత స్థాయి చేరుకున్న రెండు దేశాలలో ఒకటైన పశ్చిమ జర్మనీలో పదహారు నెలలపాటు వైజ్ఞానిక పరిశోధనలు కావించే నిమిత్తం అభ్యర్థులనెన్నిక చేయడానికి జరుగుతున్న ఇంటర్వ్యూ అది. నేను ఉత్కంఠతో లోపల అడుగు పెట్టాను.

విశాలమైన హాలు. మధ్యగా ఓ పెద్దబల్ల. బల్లచుట్టూ ఆరుగురు మనుషులు. వారిలో డాడ్ సంస్థకు చెందిన జర్మన్ వనిత కూడా ఉంది.

బోర్డు సభ్యులంతా నావంక ఒక పర్యాయం కుతూహలంగా చూశారు. ఒకాయన నా పేరు, అర్హతలు అడిగాడు. చెప్పాను. జర్మన్ వనిత జర్మనీలో ప్లేస్‌మెంటుందా అనడిగింది. ఉందని చెబితే పేరు, అడ్రస్ నోటు చేసుకుంది.

"ఇప్పుడు లాబొరేటరీలో చేస్తున్న వర్కు టైటిల్ మాత్రం చెప్పు -" అన్నాడొకాయన. ఉత్సాహంగా చెప్పాను. ఉత్సాహమెందుకంటే అప్పటికి ఇండియా మొత్తం మీద నేనొక్కడినే చేస్తున్న కొత్తరకం రీసెర్చి వర్కు అది. దాని గురించి చాలా వివరాలు చెప్పుకోవాలన్న నా సరదా - సెలక్షన్ గురించిన ఉత్కంఠను కూడా అధిగమించింది.

"ఈ వర్కువల్ల దేశానికి ప్రయోజనముందని నీ భావమా?" అన్నాడాయన.

"ఊఁ" అన్నాను. ఎందుకని అడిగితే చెప్పాలని ఆశపడ్డాను. కానీ ఆయన తన చుట్టూ వారి వంక చూసి - "ఎనీమోర్ క్వశ్చన్స్!" అన్నాడు. బోర్డు మెంబర్సందరూ అడ్డంగా తలాడించగానే - "నువ్వు వెళ్ళొచ్చు -" అన్నాడాయన.

నేను లేచి వెనక్కు తిరగ్గానే కళ్ల నీళ్ల పర్యంతమయింది. దీనికోసమా నేనింత కష్టపడి ప్రయాణం చేసివచ్చాను.

నేను బయటకు రాగానే మిత్రులు ముగ్గురూ విశేషాలడిగారు.

"మీకులాగే నాకూ జరిగింది" అన్నాను.

"సెలక్షన్ ముందుగానే అయిపోయింది. మన కళ్ళు తుడవడానికే ఈ ఇంటర్వ్యూ. ఇలాంటి అవకాశాలు మనలాంటి వాళ్ల దాకా రానిస్తారా? ఈ మాత్రం దానికి ఎంత టైమూ, డబ్బూ వృధా అయింది." అన్నాడు భూషణ్.

"ఆఫీసు స్పెషల్ లీవు గ్రాంటు చేసింది. దారి ఖర్చులు భరించింది. కాబట్టి టైమూ, డబ్బూ కూడా ప్రభుత్వానిదే వృధా అయింది -" అన్నాను నేను.

ఇంటర్వ్యూకు నలభై ఒక్క మంది వచ్చారు. స్కాలర్ షిప్స్ పన్నెండున్నాయట.

పైకి అనకపోయినా మనసులో మాకు సుధామ్ మీద అనుమానముంది. అతడు ఢిల్లీలో ఓ మెంబరాఫ్ పార్లమెంటు ఇంట బస చేశాడు. ఆ ఎం.పీ అతడికి దూరపు బంధువనీ - సుధామ్ ఈ ఫెలోషిప్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడనీ మాకు తెలిసింది.

ఆర్థికంగా ఎంతో వెనకబడి ఉన్న మన దేశంలో ఇలాంటి అర్థంలేని ఇంటర్వ్యూలు పోవాలని నా మనసుకు తోచింది.

ఎలాగో మళ్ళీ కలకత్తాకు తిరుగు ప్రయాణమయ్యాం.

దారిలో మళ్ళీ మామూలే. భూషణ్ నన్ను నా అలవాట్ల గురించి సతాయించాడు. తొందరగా మంచి అలవాట్లు చేసుకోమనీ లేకుంటే జర్మనీ వెళ్ళాక నానా ఇబ్బందులూ పడతాననీ బెదిరించాడతడు.

అతడు చెప్పిందాంట్లో కొంత నిజముంది. ఉదాహరణకు -

పాశ్చాత్య దేశంలో శాకాహారం ఎంత అరుదంటే - నా మిత్రుడి మిత్రుడొకడు కెనడా వెళ్ళాడు. అతడు పక్కా శాకాహారి. ఈ శాకాహారి ఓ పార్టీకి వెడితే అక్కడ అతడు తినగల పదార్థమొక్కటీ లేదుట. అక్కడున్న వారికతడి పరిస్థితి అర్థం కాకపోతే - ఆ పార్టీలో ఉన్న మరో ఇండియన్ అతడు శాకాహారి అని చెప్పాడుట. ఈ వార్త ఆ నోటా ఈ నోటా పాకిన పదినిముషాల్లో పేరు పొందిన ఓ ప్రొఫెసర్ పరుగు పరుగున వచ్చి ఈ శాకాహారిని కలుసుకుని - "ఆర్ యూ మిస్టర్ అవధానీ -" అనడిగి అతడవుననగానే తన్ను పరిచయం చేసుకున్నాట్ట. అవధానికి ఆ ప్రొఫెసరు పేరు తెలుసు. అంత గొప్పవాడికి తన గురించి ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపడుతూండగా - "నేనింతవరకూ శాకాహారుల గురించి వినడమే కానీ వాళ్ళెలాగుంటారో చూడలేదు. కేవలం శాకాహారం మీద పెరిగిన మనిషెలాగుంటాడో చూడాలని కొన్నేళ్ళుగా కలలు కంటున్నాను. ఇన్నాళ్ల కు తీరింది -" అన్నాడుట ఆ ప్రొఫెసర్.

అలాంటి దేశంలో భూషణ్ వంటి వ్యక్తికి ఫరవాలేదు. అక్కడివారు బీఫ్ (ఆవు మాంసం) ఎక్కువగా తింటారు. హిందువులు అది తినకపోయినా - ఇతర మాంసాహారం కూడా సమృద్ధిగా లభిస్తుందక్కడ.

"సమస్యలు రెండు రకాలు డాక్టర్ భూషణ్! కొన్నిటికి ముందుగా పరిష్కారం అవసరం. కొన్ని ఎదుటపడ్డాకనే వాటి గురించి ఆలోచించాలి. నువ్వు చెప్పేది రెండవరకం. ఇంకా మన ఇంటర్వ్యూ ఫలితాలే తెలియవు..." అన్నాను.

"ఈరోజు నేను చెబుతున్నాను విను. నువ్వూ నేనూ కూడా ఈ ఇంటర్వ్యూలో సెలక్టవుతామని నాకు నమ్మకంగా ఉంది. ఈలోగా నువ్వు కనీసం కోడిగుడ్డైనా అలవాటు చేసుకో. టీ అయినా తాగడం నేర్చుకో -" అన్నాడు భూషణ్.

"నీతో పాటు నేను కూడా సెలక్టవతానని అనుకుంటున్నందుకు నా థాంక్స్?" అన్నాను. అతడి సలహాకి థాంక్స్ చెప్పలేదు.

కలకత్తా చేరుకోగానే ఇంటిల్లపాదీ నన్ను ఇంటర్వ్యూ గురించి అడిగారు. నేను భూషణ్ గురించి చెప్పాను. "ఇంటర్వ్యూ గురించి చెప్పు -" అన్నాడు అన్నయ్య.

ఇంటర్వ్యూ ఎలా జరిగిందో చెప్పాను.

"ఇంటర్వ్యూ జరిగిన పద్ధతి ప్రోత్సాహకరంగా లేదు -" అన్నాడన్నయ్య నిరుత్సాహంగా ముఖంపెట్టి.

"మనం సంతోషించాల్సినదేమిటంటే - నా ఒక్కడికే కాదు. ఇంచుమించు అందరి ఇంటర్వ్యూ ఇలాగే జరిగింది -" అన్నాను.

"ఫలితం ఎన్నాళ్లలో తెలుస్తుంది?" అన్నాడు అన్నయ్య.

"బహుశా రెండువారాల్లో తెలియవచ్చు. తెలియగానే నీకుత్తరం రాస్తాను." అన్నాను.

నాకంటే ఎక్కువగా ఉంది అన్నయ్య ఆత్రుత నా ఫలితం గురించి!

అన్నయ్యకు నిరంతర ప్రచారం అలవాటు. తన గురించేకాక తనవాళ్ల గురించి కూడా ఇంట్లో ప్రచారం చేసుకుంటాడు. మా యింట్లో ఇంతవరకూ ఎవరూ ఫారిన్ వెళ్లలేదు. నా గురించి తన మిత్రవర్గంలో చెప్పుకోవాలని అన్నయ్య ఆత్రుత. ఉద్యోగరీత్యా నాకంటే ఎక్కువ స్థాయిలో ఉన్న అన్నయ్యకు నా గురించిన ప్రచారమిచ్చే ఆనందమేమిటో అర్థంకాదు. బహుశా అదే అభిమానమేమో!

కలకత్తాలో సరదాగా గడుస్తోంది.

దీపావళి ఆంధ్రసచిత్ర వారపత్రికలో నా కథను నేను కలకత్తాలోనే చదువుకున్నాను. ఎన్నికైన ఆరు కథలూ చదివేక నాకు నా కథే అన్నింటికన్నా బాగున్నదనిపించింది. మిగతా అయిదుగురు రచయితలూ కూడా అలాగే అనుకుని ఉండవచ్చు. కానీ నా మటుకు నేను నా నిర్ణయం నిష్పాక్షికమైనదనే అనుకున్నాను. అన్నయ్య, వదిన, కలకత్తాలోని కొందరు అన్నయ్య మిత్రులు స్వయంగా నన్నభినందించారు.

మా దీపావళి కలకత్తాలోనే జరిగింది.

నేను భువనేశ్వర్ తిరుగు ప్రయాణం కాబోయేముందు అన్నయ్య ఓ హస్తసాముద్రిక వేత్తను మా యింటికి పిల్చుకుని వచ్చాడు. అతడు చేయి చూసి ఎందరికో ఎన్నో వివరాలు ఖచ్చితంగా చెప్పాట్ట. ఇంతవరకూ అతడు చెప్పింది తప్పు కాలేదుట.

అన్నయ్య చేయి చూపించుకోమని నన్ను బలవంతపెట్టాడు.

అది నాకిష్టంలేదు.

జ్యోతిషం మీద నాకు నమ్మకం లేదు. అపనమ్మకమూ లేదు. చేయి చూసి ఫారిన్ చాన్స్ లేదంటే మనసు పాడవుతుంది.

అయినా అన్నయ్య బలవంతంవల్ల నాకు తప్పలేదు. జ్యోతిషుడి ముందు చేయి సాచాను - భవిష్యత్తులో శుభం ప్రసాదించమని అడుక్కుంటున్న బిచ్చగాడిలా!

జ్యోతిష్కుడు నా చేయిని అటూయిటూ తిప్పి రేఖలను పరిశీలించి "ఇది విచిత్రమైన విశిష్టమైన చేయి -" అన్నాడు.

నాకిది ముందే తెలుసునన్నట్లు అన్నయ్య అందరివంకా ఓసారి గర్వంగా చూసి జ్యోతిష్కుడి వైపు తిరిగాడు.

జ్యోతిష్కుడు నా చేతిలోని ఒకో రేఖనే వర్ణిస్తూ దాని గుణగణాలు చెబుతూ గతంలో జరిగినవీ, భవిష్యత్తులో జరగనున్నవీ సూచనప్రాయంగా చెప్పసాగాడు.

గతంలో జరిగినవి చాలావరకూ అతడు సరిగానే చెప్పడంతో నాలోకూడా అనుకోకుండా ఆత్రుత పెరిగింది. రేఖలను బట్టి అతడు నా మనస్తత్వాన్ని నిర్ణయిస్తూంటే నాకాశ్చర్యంగా ఉంది. మనిషి మనస్తత్వం అతడి చేతిలోని రేఖలపై ఉంటుందన్న విషయం నమ్మదగిన నిజంగా కనబడుతోంది నాకు. నా మనస్తత్వాన్నతడు అరటిపండు వలిచి పెట్టినంత సులభంగా చెబుతున్నాడు. శ్రీమతి, వదిన కూడా అతడి మాటలు వింటూ ఒకరివంక ఒకరు చూసుకుని ముసిముసిగా నవ్వుకుంటున్నారు. ఎందుకంటే వారిద్దరికీ నా మనస్తత్వం గురించి తెలుసు. జ్యోతిష్కుడు చెప్పే విశేషాలు కొన్ని నాకిబ్బందికరంగా కూడా ఉంటున్నాయి.

"నేను చెప్పగలిగింది చెప్పాను. మీరింకా అడగదల్చుకుంటే ప్రయత్నిస్తాను -"

"ముఖ్యమైనది మీరు చెప్పనే లేదు" అన్నాడు అన్నయ్య.

"ఏమిటది?" అన్నాడు జ్యోతిష్కుడు.

"మా తమ్ముడు ఫారిన్ వెడతాడా?"

జ్యోతిష్కుడి ముఖం అదోలాగయింది. ఏదో జవాబు చెప్పబోయి అతడు నా చేయి అందుకుని మరోసారి పరీక్షగా చూశాడు. ఆ చూడడంలో చేతిని బాగా నలిపి నన్ను కాస్త ఇబ్బంది పెట్టాడు కూడా.

"ఇతను చాలా గొప్పవాడవుతాడు. ఏదో ఒక లలిత కళలోనూ, తను చేపట్టిన వృత్తిలోనూ బాగా పేరు సంపాదించుకుంటాడు. కానీ.." అని ఆగిపోయాడు జ్యోతిష్కుడు.

అంతా ఊపిరి బిగబట్టారు. అతడు చెప్పబోయేదానిపైనే నా భవిష్యత్తంతా ఆధారపడి ఉన్నట్లు - ఆ క్షణంలో నాక్కూడా అనిపించింది. అయితే తను చెప్పబోయేదేమిటో అందరికీ ఆ కానీయే సూచించిందన్నట్లుగా అర్ధోక్తిలో ఆగిపోయి ఊరుకున్నాడు జ్యోతిష్కుడు.

కానీ అన్నయ్య మాత్రం అతణ్ణి వదలకుండా "ఊ...కానీ...ఆ కానీ ఏమిటో చెప్పండి!" అన్నాడు.

"ఇతడి చేతిలో ఫారిన్ గీత లేదు. అంటే, విదేశయానాన్ని సూచించే గీత నాకీ చేతిలో కనబడలేదు -" అన్నాడు జ్యోతిష్కుడు.

నేననుకున్నంతా అయింది. ఇంటర్వ్యూ ఫలితం ఆరోజే వచ్చిన భావన నాతోపాటు చాలామందికి కలిగింది.

అప్పుడక్కడ హస్తసాముద్రికానికి వ్యతిరేకంగా చర్చలు జరిగాయి. కానీ ఎవరి ముఖాల్లోనూ తృప్తిలేదు.

"ఈ జ్యోతిష్కుడు చెప్పినది తప్పయిన వ్యక్తి నాకొకడు తెలుసు -" అన్నాడన్నయ్య. వాడి ముఖంలో అభిమానమే తప్ప నిజాయితీ కనపడలేదు నాకు.

జీవితంలో మరెన్నడూ జోస్యం చెప్పించుకోనని శ్రీమతి ఆ రాత్రి నాదగ్గర వాగ్దానం చేసింది.

ఏదో వచ్చిపోయిన అనుభూతి అప్పుడే మా యింట్లో వచ్చేసింది.

## 8

"ఏమయింది?" అన్నానాశ్చర్యంగా.

"డాడ్ సెలక్షన్ లిస్టు ఆఫీసుకి వచ్చింది. భూషణ్ సెలక్టయ్యాడు. మీ పేరు వెయిటింగ్ లిస్టులో రెండవ నంబరు -" అన్నాడు రవి.

అప్పటికి ఇంటర్వ్యూ జరిగి మూడువారాలు పూర్తికాలేదు. అనుకున్న ప్రకారమే ఫలితం తెలిసినందుకు ఆశ్చర్యపడుతూ ఆఫీసు రూముకు వెళ్ళి లిస్టు చూశాను.

మొత్తం పన్నెండుగురు సెలక్టయ్యారు. వెయిటింగ్ లిస్టులో అయిదుగురున్నారు. అందులో నేను రెండవవాణ్ణి.

ఇది సీయస్సయ్యార్ చేసిన ప్రొవిజనల్ సెలక్షన్. ఈ పదిహేడు పేర్లూ వివరాలతో సహా పశ్చిమ జర్మనీ వెడతాయి. అక్కడివారు అందరి వివరాలూ క్షుణ్ణంగా పరిశీలించి ఈ పదిహేడుగురిలోంచీ పన్నెండుగురిని ఎన్నుకుంటారు. అప్పుడు ఈ లిస్టులోని పన్నెండుగురిలో కొందరుపోయి వెయిటింగ్ లిస్టులో కొందరు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఎటొచ్చీ ఈ పదిహేడుగురిలోనూ పన్నెండుగురు జర్మనీ వెళ్లడం ఖాయం. గత సంవత్సరం మా లాబరేటరీ నుంచి జర్మనీ వెళ్ళిన రంజన్ కూడా తొలుత వెయిటింగ్ లిస్ట్ నంబర్ టూయే! అందువల్ల వెయిటింగ్ లిస్టు నంబర్ టూ అంటే మా లాబరెటరీకి అచ్చివచ్చిందనుకున్నాను మనసులో. మనిషెంత చదువుకున్నా, వైజ్ఞానికంగా ఎంతటి ప్రగతిని సాధించినా, ఎంతటి ఆలోచనా శక్తిని కలిగి ఉన్నా అర్థంలేని నమ్మకాలకు లోనవడం మాత్రం తప్పదు. అపోలో - 13 యాత్రికులు ప్రమాదంలో ఉంటే శాస్త్రజ్ఞులు తమ ప్రయత్నాలు చేస్తుంటే మిగతా ప్రజలు వారి క్షేమం గురించి చర్చిల్లో ప్రార్థనలు చేశారు. అపోలో యాత్రనూ, చర్చిలో ప్రార్థననూ కలిపి ఆలోచించినపుడల్లా మనిషి బలహీనత స్పష్టంగా తెలుస్తుంది.

అందుకే నా పేరు వెయిటింగ్ లిస్టులో కనబడగానే నా ఆలోచనలు రకరకాలుగా మళ్ళాయి. ఎంతటి సానుకూల స్థితీ నా విషయంలో వెయిటింగ్ లిస్టుగా మారి కొంతకాలం కలవర పెట్టి చివరికి సానుకూలమవుతుంది. ఎమ్మెస్సీలో చేరినప్పుడూ, పి.హెచ్.డీ థీసిస్ సబ్మిట్ చేసినప్పుడూ, ఉద్యోగంలో చేరినప్పుడూ ఇలాంటి సంకట పరిస్థితులు నాకేర్పడి ఉన్నాయి. అలాగే ఇప్పుడూ జరగొచ్చు. ఏది ఏమైనా అసలు విషయం తెలియడానికింకా నాలుగైదు నెలలు పడుతుంది. ఈలోగా తెలిసినవారందరూ నేను జర్మనీ వెడుతున్నట్లే మాట్లాడతారు. తీరా చేసి అవకాశం రాకపోతే చిన్నతనంగా కనిపిస్తుంది. ఈ వెయిటింగ్ లిస్టు సంకట పరిస్థితే కొంతకాలం.

నా పేరు వెయిటింగ్ లిస్టులో ఉన్నదని తెలియగానే నా మిత్రుడు మురళీధర్ ఓసారి చేయి చూపించమన్నాడు. అతడికి హస్తసాముద్రికంలో ప్రవేశముంది.

నాకు నమ్మకం లేదన్నాను.

"మీకోసం కాదండి - నాకోసం! నా పరిజ్ఞానాన్ని పరీక్షించుకుందామని అడుగుతున్నాను తప్ప మీకేదో చెప్పాలనీ, చెప్పగలననీ కాదు -" అన్నాడతడు.

నిజం చెప్పాలంటే నాకు చేయి చూపాలనే ఉంది. ఒక జ్యోతిష్కుడు నా చేతిలో ఫారిన్ రేఖ లేదన్నాడు. రేఖలను బట్టి నా మనస్తత్వాన్ని చక్కగా అంచనా వేశాడతడు. అయితే విదేశయానం కూడా చేతి రేఖలపై ఆధారపడి ఉంటుందా? ఈ విషయం నేను నమ్మినా నమ్మకపోయినా భవిష్యత్తు గురించి తెలుసుకోవాలన్న బలహీనత ఎంతో కొంత నాలోనూ ఉంది. అందువల్లనే మురళీధర్. బలహీనతకు లొంగాను.

అతను నా చేయి కాసేపు పరీక్షించి ఊరుకున్నాడు.

"మాట్లాడరేం?" అన్నాను.

"మీకింట్రస్టు లేదుకదా - ఏదో నా కుతూహలం కొద్దీ చూశానంతే!"

"కాదు. మీరేదో చెప్పలేక దాస్తున్నారు."

"అలా ఎందుకనుకుంటున్నారు?"

"నా చేతిలో ఫారిన్ రేఖ లేదు కదా!" అన్నాను.

"మీకెలా తెలుసు?" అన్నాడతడు.

హతాశుణ్ణయ్యాను. ఒకరు కాదు - ఇద్దరు జ్యోతిష్కులంత ఖచ్చితంగా చెబుతున్నారంటే అందులో కొంతైనా నిజముందేమోననిపించింది.

"కలకత్తాలో ఓ జ్యోతిష్కుడు చెప్పాడు. మీ అభిప్రాయమూ అదేనా?"

"నా అభిప్రాయం సంగతెలాగున్నా మీకు నేనో సలహా యిస్తాను. హస్తసాముద్రికాన్ని నమ్మని పక్షంలో - మీరు మీ అభిప్రాయానికి కట్టుబడి ఉండండి. కొత్త నమ్మకాలకు గురికాకండి. ఈ విషయంలో నా పరిజ్ఞానం పరిమితం -" అన్నాడు మురళీధర్.

నిరుత్సాహం నా ముఖంలో స్పష్టంగా చూడగలిగిన కారణంగానే అతడు నాకు ఆ సలహా యిచ్చి ఉంటాడని గ్రహించాను

" హస్తసాముద్రికం మీద మీ అభిప్రాయమేమిటి?" అనడిగాను.

"నాకు నూటికి నూరుపాళ్ళూ నమ్మకముంది. ఎటొచ్చీ చెప్పేవాడికి కూలంకష పరిజ్ఞానముండాలి - అంతే!" అన్నాడు మురళీధర్.

మధ్యాహ్నం లంచవర్లో ఇంటికి వెళ్ళినపుడు శ్రీమతికి డాడ్ నుంచి వచ్చిన సమాచారం చెప్పి - "మురళీధర్ కూడా నా చేతిలో ఫారిన్ రేఖ లేదన్నాడు -" అన్నాను.

శ్రీమతి నావంక జాలిగా చూసి - "మీ చేతిలో ఫారిన్ గీత లేకపోతే అది అప్పటికప్పుడు ఉదయిస్తుంది. మీరు జర్మనీ వెళ్ల డం ఖాయం. కానీ నాదొక్కమాట -" అంది.

"ఏమిటి?" అన్నాను.

"లేవులేవంటూనే మీరు చాలా సెంటిమెంట్సుకు గురవుతున్నారు. మీ కోసమే చెబుతున్నాను కాబట్టి నా ఒక్క సెంటిమెంటు కూడా మన్నించాలి -" అంది శ్రీమతి.

"నీ సెంటిమెంటు మీదే నా జీవితమంతా ఆధారపడి ఉంది. తప్పకుండా వింటాను. చెప్పు" అన్నాను.

"మీకీ ఫెలోషిప్ వస్తే మనం కుటుంబంతో తిరుపతి వెళ్ళి శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకుందాం. ఇందుకు మీరు కాదనకూడదు -" అంది శ్రీమతి.

"రాకపోతే వెళ్ల ం. అందుకూ ఒప్పుకోవాలి నువ్వు -" అన్నాను.

"ఆ దేవుడికి మొక్కుకున్నాక రాకపోవడమేంటండీ - వచ్చి తీర్తుంది -" అంది శ్రీమతి నమ్మకంగా.

"అంటే - ఆ దేవుడివల్లే నాకు ఫెలోషిప్ వస్తుందంటావు. నావల్ల కాదంటావు -" అన్నాను రవంత అహంకారంతో. కానీ గతంలో నాపట్ల రెండు మొక్కులు ఫలించిన విషయం గుర్తుకువస్తోంది నాకు.

"మీ అర్హతలతో ఉన్నవాళ్ల ంతా మీకులాగే ఉన్నారా?" అంటూ ఎదురు ప్రశ్నవేసింది శ్రీమతి.

నిజమే మరి - కొంతమంది నాకంటే ఇంకా ఉన్నత స్థానంలో ఉన్నారు. కొందరు మరీ దయనీయస్థితిలో ఉన్నారు. స్వయంకృషికి ఫలితముండకపోదు. కానీ అదృష్టాన్ని కాదనడం కష్టం. ఈ అదృష్టాన్ని కాదనడం కష్టం. ఈ అదృష్టాన్నే దేవుడికి ముడిపెట్టుకోవాలేమో మరి!

నేను దేవుడికి మొక్కుకున్నాను. గతంలో మొక్కుకున్నప్పుడూ నా మనసింకా పరిణితి చెందలేదనుకున్నాను. ఇప్పుడలాగనుకుందుకు లేకనేమో నా అంతరాత్మ ఫక్కుమని నవ్వినట్లనిపించింది. అది శ్రీమతికి చెప్పుకుని బాధపడ్డాను.

"దేవుణ్ణి నమ్మేవాళ్లకే అంతరాత్మ ఉంటుంది. అంతరాత్మంటూ ఉంటే అది దేవుణ్ణి నమ్మిన వాళ్లను చూసి నవ్వదు. నవ్వినా ఈపాటి మొక్కుకు అంతగా తటపటాయించారని నవ్వి ఉంటుంది -" అంది శ్రీమతి.

నేనీ విషయమై శ్రీమతితో ఎక్కువగా వాదించలేదు. ఎన్నో విషయాల్లో ఆమెని మూఢనమ్మకాలని గేలిచేసే నేను - ఆమెకు భిన్నం కాదని ఈరోజే ఋజువయింది.

## 9

బజార్లో అమూల్ స్ప్రే ఎక్కడా దొరకడం లేదు. మా పిల్లలిద్దరూ కూడా రోజుకు గ్లాసెడు పాలుకూడా తాగరు - అదైనా మేము బలవంతం పెట్టాక! అందువల్ల అమూల్ స్ప్రే గురించి నాకంత పట్టింపులేదు. రవి యింట్లో చంటిపాప ఉంది. ఆ పాపకు అమూల్ స్ప్రే తప్ప ఇతర డబ్బాపాలు పడవు. అతడీ ఇబ్బందినెలా ఎదుర్కొనడమా అని చూస్తూండగా అదృష్టవశాత్తూ మా లాబరేటరీ కో ఆపరేటివ్ స్టోర్సుకి కొన్ని అమూల్ స్ప్రే డబ్బాలు వచ్చాయి. వచ్చిన డబ్బాలు తక్కువ, కావలసిన వారెక్కువమంది - ఈ సమస్యకు పరిష్కారంగా కావలసినవాళ్ల పేర్లన్నీ రాసి - వాటిని కలిపి ఓ చీటీ తీసే లాటరీ పద్ధతి పెట్టారు.

ఈ లాటరీకి రవి అమూల్ స్ప్రే అవసరంలేని నాబోటి వారందరి పేర్లూ కూడా తనకోసం ఇచ్చాడు. లాటరీ తీయగా అతడిచ్చిన పేర్లలో నా పేరొక్కటే వచ్చింది.

సరిగ్గా ఆ సమయంలో కొత్త ఆంధ్ర సచిత్రవారపత్రిక వచ్చింది. అందులో పాఠకుల నిర్ణయం ప్రకారం - దీపావళి సంచికలో ప్రచురించబడిన ఆరు పోటీకథల్లోనూ - నా కథకు మొదటి బహుమతి వచ్చినవైనముంది.

ఇలా జరుగుతుందనుకోవడం వేరు. జరగడం వేరు.

నాకు కలిగిన థ్రిల్ ఇంతా అంతా కాదు.

అప్పుడు నా పక్కనే ఉన్న భాస్కర్ - "మీ జాతకం మంచిదశలో ఉన్నట్లుంది. ఓ లాటరీ టికెట్ కొని చూడండి -" అన్నాడు. వేళాకోళంగా అప్పటికి నవ్వేసినా అతడి మాటలు నామీద ప్రభావం చూపించాయి. మర్నాడు శ్రీమతి పేరున మొదటిసారిగా బ్యాంకులో బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేశాను. ఆశ్చర్యమేమిటంటే ఆ అకౌంట్ నంబర్లో అంకెలన్నీ కలిపితే పదమూడు వచ్చింది. పదమూడును నేనేనాడో లక్కీనంబరుగా గుర్తించి ఉండడంవల్ల శ్రీమతికి భాస్కర్ అన్న మాటలు చెప్పాను. వెంటనే ఆమె నన్ను బలవంత పెట్టి ఓ లాటరీ టికెట్ కొనిపించింది. తను బలవంతపెట్టిందనడం కంటే నేనే ఆమెను బలవంత పెట్టేలా చేశాననడం సబబు. లాటరీ ఫలితాలకోసం ఆతృతగా ఎదురు చూశాను. మా టిక్కెట్టుకు ఐదు రూపాయల బహుమతి కూడా రాలేదంటే అది వేరే సంగతి.

అదృష్టానికి శుభసూచనలుంటాయి. నాకు శుభసూచనలతో పాటు అపశకునాలు ఎదురయ్యాయి. శుభశకునాలను శుభంగానే భావిస్తూ అపశకునాలను మాత్రం నా ప్రత్యేకతగా భావించి అవీ నా మంచికేనని సరిపెట్టుకున్నాను.

రోజులు గడుస్తున్నాయి.

ఫెలోషిప్ వస్తుందన్న అనుమానమో ఏమో నేను పిల్లల్ని వదిలి ఒక్క క్షణంకూడా ఉండలేకపోతున్నాను. ఫారిన్ వెడితే భార్యాబిడ్డలను వదిలి పదహారు నెలలు ఉండాలన్న భావన నా మనసును పాడుచేస్తోంది. ఈ ఫెలోషిప్‌లో నా ఒక్కడికి మాత్రమే ప్రభుత్వం దారి ఖర్చులు భరిస్తుంది. భార్యాబిడ్డలను తీసుకుని వెళ్ల డానికి స్వంత డబ్బు పదివేలు కావాలి. అంత నేనెక్కణ్ణించి తేగలను?

ఈ ఆలోచన నాలో దిగులు రేపుతూండేది. జర్మనీలో నాకు ప్లేస్‌మెంటిచ్చినాయన పేరు డాక్టర్ రాలెక్. ఆయన్నుంచి నాకో ఉత్తరం వచ్చింది. డాడ్ వాళ్ళు నా గురించి ఆయనకు ఉత్తరం రాశారుట. తను అంగీకరిస్తూ బదులు రాశాడట. నాకు ఫెలోషిప్ రావడం తథ్యమనీ సిద్ధంగా ఉండమనీ ఆయన తెలియబరిచాడు. ఆ ఉత్తరం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఒక పాశ్చాత్య శాస్త్రజ్ఞుడు నా విషయంలో ఇంత శ్రద్ధ తీసుకుని - ఎప్పటికప్పుడు వివరాలు తెలియబరుస్తూండడం అపూర్వంగా కూడా నాకనిపించింది.

ఉత్తరం వచ్చిన పదిరోజులకు నేను లాబరేటరీ పనిమీద సింద్రీ వెళ్ళి వారం రోజులుండి రావలసివచ్చింది. సింద్రీ వెళ్ళే ముందు నేను శ్రీమతినీ, పిల్లలనూ ఇంటికి పంపేశాను.

సింద్రీలో నాకు తెలిసిన నలుగురైదుగురు తెలుగువాళ్ళున్నారు. వారు నన్నెంతో ఆదరించారు. అయినా అక్కడున్న వారం రోజుల్లోనూ భార్యాబిడ్డల్ని తల్చుకోని క్షణం ఒక్కటికూడా ఉండదు. ఇప్పుడే ఇలాగుంటే - ఒకవేళ నేను జర్మనీ వెడితే ఎలాగుండగలనా అనిపించింది.

నేను మితభాషిని. కలివిడి, చొరవ నాకు లేవు. వివాహమైన మరుక్షణం నుంచీ నా ఏకైక స్నేహితురాలు నా భార్య. బిడ్డలు పుట్టేక వారే నా జీవితమయ్యారు. ఇంతగా వారు ముగ్గురితోటీ అనుబంధమేర్పడింది. వారిని వదిలి నేనెలా ఉండగలను?

సింద్రీలో శర్మ అనబడే నా స్నేహితుడు జ్యోతిషంలోనూ, హస్తసాముద్రికంలోనూ మంచి ప్రావీణ్యం సంపాదించి పేరు తెచ్చుకున్నాడు. అతడు నా వెయిటింగ్ లిస్టు కథ విని చేయి చూపమని అడిగి చూసి మౌనం వహించాడు. నేను వేధించి వేధించి అతడి నుంచి సమాచారంలాగాను.

కథ మామూలే - నా చేతిలో ఫారిన్ రేఖ లేదుట!

నాకు బ్రాహ్మణుడు - మేక - నలుగురు దొంగల కథ గుర్తుకొచ్చింది. కథలో బ్రాహ్మణుడు మేకను కుక్క అనుకున్నాడు. నేను లేని దిగులును మనసులో సృష్టించుకుంటున్నాను.

తిరుగుప్రయాణంలో చెప్పుకోతగ్గ అపశకునం ఎదురయింది నాకు. నా టికెట్ ఫస్టుక్లాసు. కానీ రిజర్వేషన్ లేక అందులో ఎక్కనివ్వలేదు. చిత్రంగా జనరల్ కంపార్టుమెంటు ఖాళీగా ఉంది. ఫస్ట్‌క్లాస్ టికెట్‌లో పగటిపూట ప్రయాణానికి రిజర్వేషన్ అవసరముండదు. అయినా ప్రయాణాల అనుభవంలేని నేను జనరల్ కంపార్ట్‌మెంటెక్కి పై బెర్తుమీద సూట్‌కేసు పెట్టుకుని కింద సీట్లో కూర్చున్నాను. కానీ వెంటనే సూట్‌కేసుని నాకంటికి కనిపించేలా పెట్టుకొనడం మంచిదనిపించి లేచి చూస్తే సూట్‌కేసు లేదు. గుండె గుభేల్మంది.

సింద్రీలో తెల్లవారు ఝామునే టాక్సీ ఎక్కి ధన్‌బాద్ రైల్వే స్టేషను చేరుకున్నాను - అక్కడ దొంగతనాలెక్కువన్న మిత్రుల హెచ్చరిక గుర్తుంది. కానీ మరీ ఇలా కనుమూసి తెరిచేలోగా - సూట్‌కేసు మాయం కావడం నా ఊహకందనిది.

పిచ్చివాడిలా కనిపించిన వాడినల్లా అడిగాను. ఎవరో ఒకరిద్దరు - అప్పుడే ఒక పోర్టరు సూట్‌కేసుతో వెళ్లడం చూశామన్నారు. నా సంగతి విని ఒకాయన - బీహార్ రైల్వే స్టేషన్లు దొంగతనాలకు ప్రసిద్ధి అనీ - కట్టుకున్న వాడికి తెలియకుండా బట్టలు కూడా విప్పుకుని పోగల సామర్థ్యం వారికున్నదనీ - నాకు చెప్పాడు. ఆయన్ను సమర్థిస్తూ ఇంకొకాయన ఉదాహరణలు ప్రారంభించాడు. ఇంకొకాయన ప్రయాణంలో తనెంత జాగ్రత్తగా ఉండేదీ చెబుతున్నాడు.

అందరూ తమ వాక్చాతుర్యం ప్రదర్శించేవారేకానీ నాకు సాయపడేవారు కనబడ్డం లేదు. ట్రయిన్లో నుంచీ దిగి ప్లాట్‌ఫారం మీదున్న పోలీస్ స్టేషన్‌కు పరుగెత్తాను.

"నన్నేం చేయమంటారు?" అన్నాడక్కడి ఆఫీసరు - చాలా మామూలు విషయం విన్నట్లు.

"ఫిర్యాదు రాసిస్తాను. దొరికితే చూడండి. అందులో నాకు మాత్రమే పనికివచ్చే ఎంతో ముఖ్యమైన సైంటిఫిక్ లిటరేచర్ ఉంది. ఆ పేపర్లు దొరికితే చాలు" అన్నాను.

సింద్రీలో వారంరోజులు కష్టపడి లైబ్రరీ నుంచి రాసుకున్న లిటరేచర్ అది. అటు లేబరేటరీ ఇటు జర్మన్ ప్రయాణం రెండూ దృష్టిలో ఉంచుకుని సేకరించానది. ముందు ముందు నేను చేయబోయే ప్రయోగాలకు అవసరం. ఆ లిటరేచర్ పోవడం వల్ల నా సింద్రీ ప్రయాణంలో నాలుగింట ఒక పాలు నిరర్థకమైనట్లే!

రైల్వే పోలీసాఫీసర్ నాకళ్ల లోకి అదోలా చూశాడు. ఎన్నో భావాలున్న ఆ చూపులో జాలికూడా ఉంది.

"ఎప్పుడైనా రైలు ప్రయాణం చేశారా?" అన్నాడాయన.

"చేశాను" - అని తలూపి ఫిర్యాదు రాసిచ్చి ట్రయినెక్కాను. సూట్‌కేసు పోవడానికి మించి ఆ ప్రశ్న నన్ను ఎక్కువగా బాధపెట్టింది.

ట్రయిన్లో పక్కనున్న ప్రయాణీకులు నా దిగులు చూసి కారణమడిగారు. జరిగిందంతా చెప్పి పోలీసు కంప్లయింటిచ్చిన విషయం కూడా చెప్పాను.

"రైలు ప్రయాణం చేయడం మీకిది మొదటిసారా?" అన్నాడతడు.

"కాదు చాలా సార్లు చేశాను -" అన్నాక ఇదే ప్రశ్న కొద్దిసేపటి క్రితం పోలీసాఫీసరు కూడా నన్నడిగినట్లు గుర్తుకొచ్చింది. చిన్నబుచ్చుకున్న ముఖంతో "ఎంతమందికో ప్రయాణాల్లో ఎన్నో పోతూంటాయ్. మొదటిసారి ప్రయాణం చేసేవాళ్లే సామాను పోగొట్టుకోవాలని లేదుకదా!" అన్నాను.

అతడు నవ్వి - "అబ్బే - నా అభిప్రాయమదికాదు. పోలీసు కంప్లయింటిచ్చానంటేనూ - సందేహం వచ్చింది -" అన్నాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments